సాక్షి విశాఖపట్నం

శనివారం । 20 । జనవరి । 2024



విశాఖ నేపథ్యంతో చిత్రం

విశాఖ నేపథ్యం ఉన్న చిత్రాన్ని తెరకెక్కించి, మన ప్రత్యేకతను ప్రపంచానికి చాటిచెబుతానని దర్శకుడు నక్కిన త్రినాథరావు తెలిపారు.

8లో



ఎన్నికలకు ఏర్పాట్లు

నిబంధనలకు అనుగుణంగా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు జిల్లాలో ఏర్పాట్లు చేస్తామని జేసీ విశ్వనాథన్ తెలిపారు.

8లో



ఉక్కు ఉద్యమం ఉధృతం

ఉక్కు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని సినీనటుడు ఆర్.నారాయణ మూర్తి పిలుపునిచ్చారు.

8లో

న్యూస్‌రీల్

విశాఖలో మెగాస్టార్



విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న చిరంజీవి

గోపాలపట్నం: మెగాస్టార్ చిరంజీవికి ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం లభించింది. శనివారం విశాఖలో లోక్ నాయక్ ఫౌండేషన్ నిర్వహించే కార్యక్రమంలో ఆయన పాల్గొనేందుకు విశాఖ వచ్చారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో విశాఖ చేరుకున్న ఆయనకు అభిమానులు స్వాగతం పలికారు. ఆయనతో ఫొటోలు దిగేందుకు ఎగబడ్డారు. చిరంజీవి ఎయిర్ పోర్టు నుంచి నేరుగా రాడిసన్ బ్లూ హోటల్‌కు చేరుకున్నారు.

జూ సంక్రాంతి ఆదాయం రూ.18.48 లక్షలు



జూ పార్కు

ఆరిలోవ: జూ పార్కుకు సంక్రాంతి తాకిడి పెరిగింది. పండగ సెలవులతో జూ పార్కు సందర్శకులతో కళకళలాడింది. వేలమంది సందర్శకులు సరదాగా గడిపారు. వారి ద్వారా రూ.లక్షల్లో ఆదాయం చేకూరింది. ఈనెల 14 నుంచి 19వ తేదీ వరకు జూకి తాకిడి పెరిగింది. నగరవాసులతో పాటు ఇతర ప్రాంతాలు నుంచి జూ పార్కును సందర్శించారు. ఈ వారంలో జూ పార్కును 22,606 మంది సందర్శించినట్లు జూ క్యూరేటర్ నందనీ సలారియా తెలిపారు. రూ.18,48,545 ఆదాయం లభించినట్టు వెల్లడించారు.

అభివృద్ధి పనులు వేగవంతం



ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: నగరంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆమె చాంబర్లో శుక్రవారం ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు, పర్యవేక్షక ఇంజినీర్లు, కార్యనిర్వాహక ఇంజినీర్లతో నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఇప్పటికే టెండర్లు పిలిచిన పనులు సంబంధిత కాంట్రాక్టర్లు ప్రారంభించి, నిర్ణీత సమయానికే పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

కులగణన ప్రక్రియ పరిశీలన



సర్వేను పరిశీలిస్తున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే శుక్రవారం జిల్లాలో చురుగ్గా సాగింది. జిల్లా పరిధిలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆయా సచివాలయ సిబ్బంది, ఇతర విభాగాల ఉద్యోగులు డిజిటల్ మోడ్ విధానంలో ప్రజల నుంచి వివరాలు సేకరించారు. కులగణన ప్రక్రియను జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ పర్యవేక్షించారు. స్థానిక పందిమెట్ట ప్రాంతంలో దసపల్లా హిల్స్ సచివాలయ పరిధిలో జరిగిన సర్వేను జేసీ పరిశీలించి పలు సూచనలు చేశారు. సిబ్బందితో పాటు పలు గృహాలను సందర్శించి ప్రజలతో మాట్లాడారు. ఆయన వెంట జోనల్ కమిషనర్ శివప్రసాద్, డీఎల్డీవో పూర్ణిమాదేవి, ఇతర ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

1,061 మందికి వైద్య సేవలు

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా శుక్రవారం శొంఠ్యాం పీహెచ్‌సీ పరిధిలోని చింతగట్ల, తాళ్లవలస(ఆర్టీవలస) పీహెచ్‌సీ పరిధిలోని కొరడా గ్రామ సచివాలయాల పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో మొత్తం 1,061 మందికి వైద్య సేవలందించినట్లు డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు. వీరిలో ఇద్దరిని ఆరోగ్యశ్రీలో రిఫరల్ కింద కార్పొరేట్ ఆస్పత్రులకు తరలించారు.

అగ్రగామిగా ఏయూ

- రాష్ట్ర ప్రభుత్వ చొరవతో నాలుగేళ్లలో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు
- విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రత్యేక కోర్సులు
- ఉపకులపతి ప్రొ.ప్రసాదరెడ్డి నేతృత్వంలో జాతీయ స్థాయిలో ఖ్యాతి
- ఆవిష్కర్తలుగా విద్యార్థులు.. స్టార్టప్‌లకు హబ్‌గా విశ్వవిద్యాలయం
- ప్రతి అడుగూ.. యూనివర్సిటీ ప్రగతి పథం వైపు..
- ఏయూ.. ఓ దెయ్యాల కొంప అంటూ ప్రతిష్టను దిగజార్చిన టీడీపీ నేతలు
- ఇప్పుడు జాతీయ స్థాయిలో తొలి 3 యూనివర్సిటీల్లో ఒకటిగా నిలిచిన ఏయూ

సాక్షి, విశాఖపట్నం : ప్రైవేటు వర్సిటీల అడుగులకు మడుగులొత్తుతూ ప్రతిష్టాత్మక యూనివర్సిటీని తెలుగుదేశం పార్టీ పట్టించుకోకపోవడంతో మసకబారిన ఆంధ్ర విశ్వవిద్యాలయం.. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చొరవతో కొత్త ఊపిరులందుకుంది. తమ ప్రైవేటు వర్సిటీ ఎదుగుదల కోసం ఏయూ ఓ దెయ్యాల కొంప అంటూ టీడీపీ నేతలు యూనివర్సిటీ ప్రతిష్టను దిగజార్చే వాఖ్యలు చేస్తే.. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దార్శనికతతో



ఎలిమెంట్ భవనం



ఆ-హబ్

నాలుగేళ్ల కాలంలో సమాజ ఉపయుక్తంగా, పరిశ్రమల అవసరాలు తీర్చే వైవిధ్య పరిశోధన కేంద్రంగా ఆంధ్రా యూనివర్సిటీ తీర్చిదిద్దారు. విద్యార్థి అభ్యున్నతికి మార్గదర్శిగా పరిశోధనలకు ప్రధాన కేంద్రంగా ఏయూను ప్రభుత్వం మార్చింది. వివిధ దేశాలు, యూనివర్సిటీలు, సంస్థల ఒప్పందాలతో చదువుకు సహకారం అందిస్తూ ప్రతి విద్యార్థిని ప్రోత్సహించాలనే సంకల్పంతో ముందుకు వెళ్తున్న ఏయూకి జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో వైస్‌చాన్సలర్ ప్రొ.పీవీజీడీ ప్రసాదరెడ్డి నవ్య ఆలోచనలతో పనిచేస్తూ నూతన ప్రాజెక్టులను నిర్వహిస్తూ విశ్వవిద్యాలయ ప్రగతికి బాటలు వేశారు.

నలు దిశలా ప్రగతి

విద్యార్థులను ఆవిష్కర్తలుగా, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏయూ–నాస్కామ్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను రూ.27 కోట్లతో ఏర్పాటు చేశారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో గతంలో లేని విధంగా సొంతంగా ఒక స్టార్టప్, ఇంక్యుబేషన్ సెంటర్ ఆ–హబ్‌ను తీర్చిదిద్దారు. టీ–హబ్‌కు దీటుగా.. ఆ–హబ్‌లో ప్రస్తుతం 150కి పైగా స్టార్టప్ సంస్థలు ఇక్కడి నుంచి సేవలు అందిస్తున్నాయి. వేలాది మంది యువతకు ఉపాధిని అందిస్తున్నాయి. ఫార్మా రంగంలో స్టార్టప్, ఇంక్యుబేషన్ కేంద్రంగా ఎలిమెంట్ తీర్చిదిద్దారు. ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ (ఏయూ సిబ్), అవంతి



అల్గారిథమ్ బిల్డింగ్

ఫీడ్స్ సంస్థ సహకారంతో ఏర్పాటైన ఏయూ–అవంతి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, మెరైన్ సంబంధిత రంగాలలో విశిష్ట పరిశోధనలు జరుపుతూ విజయవంతంగా పనిచేస్తోంది. ఆర్ఐఎన్ఎల్ సహకారంతో హ్యూమన్ జెనిటిక్స్ విభాగంలో బయోఆర్చర్ ఇంక్యుబేషన్ కేంద్రాన్ని, ఏయూ పూర్వ విద్యార్థి రవికిరణ్ స్థాపించిన టికాబ్స్–ఇ జీవశాస్త్ర సంబంధ పరిశోధనలు, ఆవిష్కరణలు చేస్తూ విద్యార్థులు పేటెంట్లు సాధించే దిశగా పనిచేస్తోంది. అంతర్జాతీయంగా జియో ఇంజినీరింగ్ ప్రాధాన్యతను ముందుగానే గుర్తించి జియో ఇంజినీరింగ్ విభాగాన్ని పటిష్టపరిచారు. రూ.67.5 కోట్లతో సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ) సంయుక్తంగా ఏయూతో ఇంక్యుబేషన్, స్టార్టప్ సెంటర్‌ను



ఏయూ స్వాగత ద్వారం

ఏర్పాటు చేస్తోంది. ఫుడ్ టెస్టింగ్, ఇంక్యుబేషన్ కేంద్రం ఏయూలో ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఏపీ ఫుడ్ సొసైటీ రూ.5 కోట్లు మంజూరు చేసింది. ఏయూలో సేవలందిస్తున్న డిజిఫాక్ సంస్థకు వేలాది మంది యువతకు లో కోడ్ టెక్నాలజీపై ప్రత్యక్షంగా శిక్షణ అందిస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది.

98 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా..

మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థినులకు నూతన హాస్టల్ నిర్మాణం, ప్రయోగశాలలు, మౌలిక వసతుల్ని కల్పించారు. 98 ఏళ్ల వర్సిటీ చరిత్రలో ఫార్మసీ కళాశాల విద్యార్థినులకు తొలిసారిగా ప్రత్యేక హాస్టల్ భవనాన్ని కళాశాలకు చేరువలో నిర్మించారు.

వర్సిటీ విద్యార్థులకు వసతి కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ నూతనంగా ఆరెంజ్, మెటా- హెచ్ హాస్టళ్లను నూతనంగా నిర్మించడంతో పాటు, విద్య ప్రగతి విహార్, విద్య తరంగిణి విహార్ హాస్టల్‌ను ఆధునీకీకరించి అందుబాటులోకి తీసుకువచ్చారు. వీటితో పాటు శాతవాహన హాస్టల్‌లో పూర్తిస్థాయిలో వసతులు కల్పించారు. ప్రతీ విభాగంలో టాయిలెట్స్, విద్యార్థినుల రెస్ట్‌రూమ్‌లను పూర్తిగా మార్చు చేశారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఓపెన్ ఎయిర్ థియేటర్‌కు పూర్వవైభవం తీసుకువచ్చారు.

విశిష్ట గుర్తింపు

ఆంధ్రవిశ్వవిద్యాలయం జాతీయ స్థాయిలో నాక్ డబుల్ ప్లస్ గ్రేడ్‌ను, 3.74 సీజీపీఏ సాధించి సరికొత్త రికార్డును నమోదు చేసింది. ఈ గుర్తింపు 2030 వరకు ఉంటుంది. ఆచార్యుల కొరత ఉన్న సమయంలో కూడా ఏయూ ఇంతటి విశిష్ట ర్యాంక్‌ను సాధించడం జాతీయ స్థాయిలో తొలి మూడు విశ్వవిద్యాలయాలలో ఒకటిగా ఏయూ నిలిచింది.

ఆక్రమణదారుల చెర నుంచి..

నగరం నడిబొడ్డున ఉన్న ఏయూకి చెందిన విలువైన ఆస్తులను టీడీపీ నేతలు తమ కబంధ హస్తాల్లోకి తీసుకున్నారు. యూనివర్సిటీ చుట్టూ ఉన్న భూములను దశాబ్దాలుగా ఆక్రమించి వ్యాపార సముదాయాలు నిర్మించారు. యూనివర్సిటీ గ్రౌండ్, దాని పరిసరాలన్నీ పొదలతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయాయి. ఆక్రమణల పర్వంపై వీసీ ప్రసాదరెడ్డి ఉక్కుపాదం మోపారు. దాదాపు రూ.400 కోట్ల విలువైన స్థలాలను ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకుని ఆ స్థలాలను విద్యార్థులకు ఉపయుక్తంగా మలిచారు.

డ్రోన్ టెక్నాలజీకి చిరునామాగా..

ఏయూలో ప్రత్యేకంగా డ్రోన్ టెక్నాలజీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వీరికి ఉపయుక్తంగా ఏయూలో మూడు హెలీప్యాడ్లను అందుబాటులో ఉంచారు. డ్రోన్ టెక్‌లో విద్యార్థులకు అత్యుత్తమ బోధన అందిస్తున్నారు. కంప్యూటర్ సైన్స్ విద్యార్థుల అవసరాలు అనుగుణంగా నూతనంగా అల్గారిథం భవనాన్ని నిర్మించారు. దీనిలో ఆన్‌లైన్‌లో పరీక్షల నిర్వహణకు ఒక అంతస్తును కేటాయించారు. విశాలమైన తరగతి గదులు, సమావేశ మందిరాలు నిర్మించారు. నాలుగేళ్ల కాలంలో ఏయూలో విదేశీ విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగి నేడు 55 దేశాలకు చెందిన వెయ్యి మందికిపైగా విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తుండటం విశేషం.

వర్సిటీని మరింత బలోపేతం చేస్తా



నేను బాధ్యతలు తీసుకునే సమయంలో యూనివర్సిటీ హెరిటేజ్ స్ట్రక్చర్స్ పూర్తిగా శిథిలమైపోయాయి. వాటిపై దృష్టి సారించి.. ప్రభుత్వ సహకారంతో ఏయూని అభివృద్ధి చేశా. కోవిడ్ వంటి విపత్కర సమయాల్లో సైతం సకాలంలో పరీక్షలు పూర్తిచేసి, ఫలితాలను సకాలంలో అందించడం, ప్రత్యేకంగా ప్లేస్‌మెంట్ అధికారులను నియమించి ఆర్ట్స్, సైన్స్,న్యాయ కోర్సుల విద్యార్థులకు సైతం మెరుగైన ఉపాది అవకాశాల్ని కల్పించాం. ఈ ఏడాది అత్యధికంగా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని రూ. 84.5 లక్షల వేతనంతో ఉద్యోగం సాధించి రికార్డు సృష్టించింది. బయట విద్యార్థులు సైతం ఏయూ గురించి ఆలోచించే స్థాయికి సీఎం సహకారంతో తీసుకొచ్చాం. క్యాంపస్ ప్రశాంతంగా ఉంది.. న్యూసెన్స్ అంతా మీడియాలోనే జరుగుతోంది. త్వరలోనే ఏయూ శతాబ్ది ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తాం. 20 ఏళ్లగా రిక్రూట్‌మెంట్ జరగలేదు. దానిపై ప్రభుత్వం దృష్టి సారించడం శుభపరిణామం.

– ప్రొ.పీవీజీడీ ప్రసాదరెడ్డి, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి

నాలుగేళ్లలో ఏయూ రూపురేఖలు మారిపోయాయి



నాలుగేళ్లలో యూనివర్సిటీ రూపురేఖలు మారిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో క్యాంపస్‌లో మునుపెన్నడూ లేని స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించారు. కొత్త భవనాలు నిర్మించారు. పాత వాటిని పునరుద్ధరించారు. మంచి పరిపాలన, కొత్త కోర్సుల రూపకల్పన, విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్‌పై ప్రధానంగా దృష్టి సారించారు. ఇప్పటి వరకు ఎవరూ చేయలేని విధంగా ప్రస్తుత వీసీ ప్రసాదరెడ్డి అన్యాక్రాంతమైన రూ.వందల కోట్లు విలువ చేసే ఏయూ భూములు తిరిగి యూనివర్సిటీకి దక్కేలా చేశారు. నిధుల సమీకరణతో కొత్తగా చైర్ కాన్సెప్ట్‌ను తీసుకువచ్చారు. ప్రధానంగా నాక్‌లో టాప్ ర్యాంక్ రావడం ప్రతి ఒక్కరూ గర్వించాల్సిన విషయం. ఏయూ సాధించిన ప్రగతికి అదే కొలమానం. అందుకే ఆయనకు రెండోసారి వీసీగా అవకాశం దక్కింది. అనుభవజ్ఞుడు, ఏయూ అభివృద్ధికి కృషి చేసిన వారిని వీసీగా నియమిస్తే రాజకీయాలు ఆపాదించడం సమంజసం కాదు. 2026లో ఏయూ శతాబ్ది ఉత్సవాలకు ఆయనలాంటి అనుభవజ్ఞుడు ఉండాల్సిన అవసరం ఉంది.

– ప్రొ.వి.బాలమోహన్‌దాస్, నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ, వీసీ ఫోరం అధ్యక్షుడు

పకడ్బందీగా మిలాన్

విశాఖ సిటీ: విశాఖ వేదికగా ఫిబ్రవరి 19 నుంచి బీచ్ రోడ్డులో జరగనున్న మిలాన్–2024 వేడుకలకు చేయాల్సిన ఏర్పాట్ల కోసం నేవీ, పోలీస్, వివిధ విభాగాల అధికారులు శుక్రవారం క్షేత్ర స్థాయిలో పర్యటించారు. పరేడ్ జరిగే బీచ్ రోడ్డులో పలు ప్రాంతాలను సందర్శించి చేపట్టాల్సిన పనులను గుర్తించారు. మెయిన్ రోడ్డు వైపు, బీచ్ వైపు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. సామాన్య పౌరులు రాక, పార్కింగ్ సదుపాయం, డబుల్ బారికేడింగ్, మెస్ బారికేడింగ్, ఎల్ఈడీ స్క్రీన్లు, సీసీటీవీ కెమెరాల ఏర్పాట్లపై సమీక్షించారు. డీసీపీలు శ్రీనివాసరావు, ఆనందరెడ్డి, తూర్పు నావికాదళ ప్రధాన కేంద్ర డిప్యూటీ నేవల్ ప్రొవోస్ట్ మార్షల్, కమాండర్ ఉదయ్ అగర్వాల్, ఐఎన్ఎస్ కళింగ ఎగ్జిక్యూటివ్ అధికారి కెప్టెన్ దివాకర్ శంకర్, సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకుడు వి.మణిరామ్, ఇతర శాఖల అధికారులు ఏర్పాట్లు చేయాల్సిన ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా డీసీపీ శ్రీనివాసరావు, తూర్పు నావికాదళ డిప్యూటీ ప్రొవోస్ట్ మార్షల్ ఉదయ్ అగర్వాల్ ఇతర అధికారులకు ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఎన్‌సీబీ (నేవల్ కోస్టల్ బ్యాటరీ) నుంచి ఆర్‌కే బీచ్ వరకు, అలాగే వుడా పార్క్ జంక్షన్ నుంచి ఆర్‌కే బీచ్ వరకు రోడ్డుకు ఇరువైపులా డబుల్ బ్యారికేడింగ్ ఏర్పాటు చేయాలని నేవీ అధికారులకు సూచించారు. అదే విధంగా బీచ్ ప్రాంతంలో మెస్ బ్యారికేడింగ్ ఏర్పాటు చేయాలని రహదారులు భవనాల శాఖ అధికారులకు



అధికారులకు సూచనలు చేస్తున్న డీసీపీ-1 కె.శ్రీనివాసరావు

చెప్పారు. సామాన్య పౌరులు వేచి ఉండేందుకు అనువుగా బాక్సులు ఏర్పాటు చేయాలని, అక్కడ ఎల్ఈడీ స్క్రీన్లు ఉంచాలన్నారు. వాహనాల పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేసే ప్రాంతాలను పరిశీలించిన వారు గతంలో మాదిరిగా ఏపీఐఐసీ గ్రౌండ్‌లో వీఐపీ పార్కింగ్ సదుపాయం కల్పించాలని పోలీసు అధికారులకు సూచించారు. ఏయూ మైదానంలో ఇతర వాహనాల పార్కింగ్ నిమిత్తం ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించేందుకు, సూచనలు చేసేందుకు అనువుగా పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏయే ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలో సంబంధిత అధికారులకు చెప్పారు. తాగునీటి సదుపాయం, బయోటాయిలెట్ల వసతి కల్పించాలన్నారు. ఎన్‌సీబీ, గోకుల్ పార్కు, పెరల్స్ పార్కు, ఆర్కే బీచ్, విశ్వప్రియ పంక్షన్ హాలు, పామ్ బీచ్ వద్ద నున్న మైదానాన్ని అధికారులు పరిశీలించారు.


సిబ్బంది వినతులను పరిష్కరించాలి



సిబ్బంది నుంచి వినతులు స్వీకరిస్తున్న సీపీ రవిశంకర్

విశాఖ సిటీ: పోలీస్ సిబ్బంది సమస్యలు, వినతులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. పోలీసుల సమస్యల పరిష్కారానికి సీపీ శుక్రవారం తన చాంబర్‌లో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 20 మంది సిబ్బంది శాఖాపరంగా తమ సమస్యలు, వినతులను సీపీకి తెలియజేశారు. వీటిలో ఏపీజీఎల్ఐ బాండ్ రావడంలో సమస్యలు, ఇంక్రిమెంట్లలో జాప్యం, ప్రమోషన్లకు సంబంధించి వినతులు ఉన్నాయి. వాటిని పరిశీలించిన సీపీ తక్షణమే పరిష్కరించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. గత నెలలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో వచ్చిన 21 వినతులలో 17 పరిష్కరించారు. మిగిలిన 4 వినతులు పరిష్కరించే దశలో ఉన్నాయని సీపీ తెలిపారు.

11 నుంచి మెగా స్పోర్ట్స్ కార్నివాల్



పోస్టర్ విడుదల చేస్తున్న జేసీ

మహారాణిపేట: కేజీహెచ్, ఆంధ్రా మెడికల్ కాలేజీ సంయుక్తంగా నిర్వహిస్తున్న మెగా స్పోర్ట్స్ కార్నివాల్‌కు సంబంధించి వాల్ పోస్టర్‌ను శుక్రవారం జేసీ కె.ఎస్.విశ్వనాథన్ తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఏఎంసీ శతాబ్ది ఉత్సవాలు పురస్కరించుకుని ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రామ్ చీఫ్, కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్ తెలిపారు. ఆడుదాం ఆంధ్రా స్ఫూర్తితో ఫిబ్రవరి 11 నుంచి 15 వరకు క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, టెన్నిస్, అథ్లెటిక్స్, చెస్, క్యారమ్స్ తదితర పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇటీవల కేజీహెచ్‌కు చెందిన నలుగురు ఉద్యోగులు ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ స్పోర్ట్స్ నిర్వహించిన ఆటల్లో ప్రతిభ చూపి.. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. ఈ పోటీల్లో ఉద్యోగులంతా పాల్గొని విజయవంతం చేయాలని కేజీహెచ్ డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ లక్ష్మీతులసి కోరారు.

రేపు ఎకో వైజాగ్ మెగా ఆర్ట్ కాంటెస్ట్



పేర్లు నమోదుకు ఈ క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించండి

డాబాగార్డెన్స్: ఎకో వైజాగ్‌పై అవగాహన కల్పించేందుకు ఆదివారం 'ఎకో వైజాగ్ మెగా ఆర్ట్ కాంటెస్ట్' నిర్వహిస్తున్నట్లు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. ఆ రోజు ఉదయం 8 గంటలకు పోర్టు స్టేడియంలోని విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ అండ్ కన్వెన్షన్‌లో రేంజర్ ఫోర్స్ స్వచ్ఛంద సంస్థ భాగస్వామ్యంతో పోటీలు ప్రారంభమవుతారని పేర్కొన్నారు. 15 ఏళ్లలోపు వారిని జూనియర్లుగా, 15 ఏళ్లపైబడిన వారిని సీనియర్లుగా విభజించి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీనియర్ గ్రూప్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, జూనియర్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.7వేలు నగదు, రెండు గ్రూపుల్లో 50 మందిని ఎంపిక చేసి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని వివరించారు. ఔత్సాహిక చిత్రకారులు సృజనాత్మకతను వెలికి తీసి.. ఎకో వైజాగ్‌కు సంబంధించిన అంశాలు జోడిస్తూ అద్భుత చిత్రాలు వేయాల్సి ఉంటుంది. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 20వ తేదీ లోగా పేర్లు నమోదు చేసుకోవాలి. మరిన్ని వివరాలకు జీవీఎంసీ టోల్ ఫ్రీ నంబర్ 1800 4250 0009 లేదా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులను(90000 86861, 85550 58575) సంప్రదించవచ్చు.

లింగ వివక్ష, లైంగిక వేధింపుల నివారణపై నేడు సదస్సు

విశాఖ–లీగల్: పని చేసే ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు, లింగ వివక్షత నివారణ, రక్షణ చర్యలు, సునిశిత అంశాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయ మూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఆల పాటి గిరిధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు నూతన సముదాయాల భవనంలోని సమావేశ మందిరంలో మధ్యాహ్నం 12 గంటలకు ఈ సదస్సు జరుగుతుందన్నారు. లింగ వివక్షత, లైంగిక వేధింపుల నిరోధక చట్టం–2013లో పేర్కొన్న అంశాలు, రక్షణ చర్యలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. సదస్సుకు అన్ని విభాగాల జిల్లా స్థాయి అధికారులు హాజరుకావాలని ఆయన సూచించారు.

ఐసీఎస్ఐ కొత్త కార్యవర్గం ఎన్నిక


మనోజ్ పరాఖ్

సీతంపేట: ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా(ఐసీఎస్ఐ) విశాఖపట్నం చాప్టర్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. రామాటాకీస్ సమీప శ్రీనగర్ రోడ్‌లోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఎన్నికలో చైర్మన్‌గా మనోజ్ పరాఖ్, వైస్ చైర్మన్‌గా శివకుమార్ సరగడం, కార్యదర్శిగా చలపతిరావు మారుతి, కోశాధికారిగా కూచుపూడి సురేంద్ర, సభ్యులుగా గిరిధరన్, ఎస్.సుబ్బరామన్, నాగశివాని ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గం 18 జనవరి 2025 వరకు కొనసాగుతుందని సంస్థ ఇన్‌చార్జి శివరామకృష్ణ తెలిపారు.

రోడ్డు భద్రతపై ఫోకస్

- వివిధ శాఖల అధికారులతో సమన్వయం
- స్కూళ్లు, కాలేజీల్లో అవగాహన సదస్సులు
- వాహన చోదకులతో ర్యాలీలు
- రహదారి ప్రమాదాల నివారణకు సూచనలు
- నెల రోజులపాటు రవాణా శాఖ కార్యక్రమాలు



సాక్షి, విశాఖపట్నం: రోడ్డు భద్రతపై రవాణా శాఖ ఫోకస్ పెట్టింది. నెల రోజులు దీనిపై ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తోంది. ఇది విజయవంతం కావడానికి వివిధ శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటోంది. గతంలో ఏడాదికి ఒక పర్యాయం వారం రోజులు జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలను నిర్వహించేది. కానీ ఈ ఏడాది నెల రోజులపాటు కొనసాగిస్తోంది. ప్రధానంగా రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా ఈ మాసోత్సవాలను నిర్వహించనుంది. విశాఖపట్నం జిల్లాలో శనివారం ఉదయం బీచ్ రోడ్డులోని కాళిమాత ఆలయం వద్ద హెల్మెట్ ర్యాలీతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. దీనిని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ ప్రారంభించనున్నారు. దీనికి పోలీసు, ఆర్అండ్‌బీ, నేషనల్ హైవేస్, వైద్య, ఆరోగ్యం తదితర శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది హాజరవుతున్నారు. అక్కడ రోడ్డు భద్రతకు సంబంధించిన సామగ్రి, కరపత్రాలను విడుదల చేస్తారు. సోమవారం ఎంపిక చేసిన వలంటీర్లకు అవగాహన కల్పిస్తారు. 23, 24 తేదీల్లో జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశం నిర్వహించి జాతీయ, రాష్ట్ర రహదారులపై బ్లాక్ స్పాట్‌ల్లో వచ్చే ఏడాదికల్లా ప్రమాదాలను నివారించేందుకు ప్రణాళికను రూపొందిస్తారు. 25, 27 తేదీల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక మంత్రులతో కలిసి కళాశాలల విద్యార్థులతో వాక్‌థాన్ ఉంటుంది. 29న హెల్త్ చెకప్‌లో భాగంగా డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహిస్తారు. 30, 31 తేదీల్లో విద్యా సంస్థల్లో బస్సు డ్రైవర్లు, హెల్పర్లు, సూపర్‌వైజర్లు, ప్రిన్సిపాళ్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని చేపడతారు.

ఫిబ్రవరి ఒకటి నుంచి మూడు వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తారు. ఇందులో మహిళ ద్విచక్ర వాహనదార్లను కూడా భాగస్వాములను చేస్తారు. ఈ కార్యక్రమంలో హెల్మెట్ ధారణ, సీట్ బెల్టు వినియోగం అవసరాన్ని వివరిస్తారు. వాహనాన్ని నడిపేటప్పుడు మద్యం సేవించడం, సెల్‌ఫోన్‌లో మాట్లాడడం వల్ల వాటిల్లే అనర్థాలను తెలియజేస్తారు. 5, 6 తేదీల్లో గుడ్ సమరిటాన్ లాస్‌పై ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులకు అవగాహన కలిగిస్తారు. ఏడున స్థానిక ఇంజినీరింగ్ కళాశాలల ప్రొఫెసర్లతో జాతీయ, రాష్ట్ర రహదారులు, ఆర్అండ్‌బీ అధికారులకు సదస్సు ఉంటుంది. 8, 9 తేదీల్లో రోడ్డు భద్రతపై ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తారు. ఇందులో స్థానిక ఆటోమొబైల్ డీలర్లను భాగస్వాములను చేస్తారు. 12న రహదారి భద్రతపై మోటారు వాహనాల సవరణ చట్టం 2019 ప్రకారం కొత్తగా వచ్చిన నిబంధనలను వివరిస్తారు. 13న ప్రజా రవాణాలో మహిళల కోసం ఆర్టీసీ, మ్యాక్సీ, మోటారు క్యాబ్‌ల డ్రైవర్లు, యజమానులకు సదస్సు నిర్వహిస్తారు. 14, 15 తేదీల్లో వాహనాలకు బీమాపై ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు, సూపర్‌వైజర్లకు వర్క్‌షాపు ఉంటుంది. 16న సరకు రవాణా వాహనాల డ్రైవర్లు, ఓనర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తారు. 17న బడి పిల్లలకు క్విజ్, వ్యాసరచన పోటీలుంటాయి. 19న రహదారి భద్రత కార్యకలాపాల్లో ఉత్తమ వలంటీర్లు, నిర్వాహకులకు అవార్డులు, బహుమతుల ప్రదానం ఉంటుందని విశాఖ రవాణా శాఖ ఉప కమిషనర్ జీసీ రాజారత్నం తెలిపారు.

తీవ్ర విషాదం

- స్కూటీని ఢీకొన్న టిప్పర్
- బాబాయ్‌తో సహా చిన్నారి దుర్మరణం
- దువ్వాడ రైల్వే స్టేషన్ సమీపంలో ఘటన


అంశిని(ఫైల్)


ఘటనా స్థలంలో వెంకటప్రసాద్, అంశిని మృతదేహాలు

కూర్మన్నపాలెం : తాతగారి ఇంట్లో సంక్రాంతి సంబరాలు చేసుకుని బాబాయ్‌తో తిరిగి వెళ్తున్న ఓ చిన్నారిని మృత్యువు టిప్పర్ రూపంలో కబళించింది. స్కూటీ, టిప్పర్ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు, చిన్నారి(బాబాయ్, కూతురు) మృతి చెందారు. ఇప్పటికే ఇంటి పెద్దను కోల్పోయిన ఆ కుటుంబం ఇప్పుడు మరో ఇద్దర్ని పోగొట్టుకుని తీవ్ర విషాదంలో మునిగిపోయింది. దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి ట్రాఫిక్ సీఐ ఉమామహేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చోడవరం మండలం కలిగొట్ల గ్రామానికి చెందిన కొల్లి పద్మ తన కూతురు అంశిని(8)తో కలిసి సంక్రాంతికి గాజువాక దరి చిట్టినాయుడు కాలనీలోని అత్తగారి ఇంటికి వచ్చింది. పండగ ముగిసిన తరువాత కూతురిని తాతగారి వద్ద వదిలి ఆమె వెళ్లిపోయింది. శుక్రవారం కొల్లి వెంకటప్రసాద్(31) తన అన్న కూతురైన అంశినిని తీసుకుని చోడవరంలో వదిలి పెట్టేందుకు స్కూటీపై బయలుదేరాడు. దువ్వాడ రైల్వే స్టేషన్ సమీప నాగదేవత గుడి వద్దకు వచ్చేసరికి టిప్పర్ బలంగా ఢీకొట్టడంతో వెంకటప్రసాద్, అంశిని అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న దువ్వాడ ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతుడు వెంకటప్రసాద్ తండ్రి పైడిరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అంశిని తండ్రి గతంలో చనిపోవడంతో తల్లి పద్మతో ఉంటుంది. వెంకటప్రసాద్ పరవాడలోని గ్లాండ్ ఫార్మా కంపెనీలో పని చేస్తున్నాడు.

త్వరలో విశాఖ నేపథ్యంతో చిత్రం

సినీ దర్శకుడు నక్కిన త్రినాథరావు

తగరపువలస: త్వరలో విశాఖ నేపథ్యం ఉన్న చిత్రాన్ని తెరకెక్కించి, మన ప్రత్యేకతను ప్రపంచానికి చాటిచెబుతానని సినీ దర్శకుడు నక్కిన త్రినాథరావు తెలిపారు. పద్మనాభం మండలం పొట్నూరు పంచాయతీకి చెందిన త్రినాథరావును శుక్రవారం తగరపువలసలో ఆయన స్నేహితులు, భీమిలి ప్రాంత నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా త్రినాథరావు మాట్లాడుతూ తాను పద్మనాభంలో పుట్టినా విద్యాభ్యాసం అంతా అనకాపల్లిలో సాగిందన్నారు. దర్శకుడిగా చిట్టివలస, తగరపువలసలో మూడు సినిమాలు చేశానన్నారు. ప్రస్తుతం రూ.200 కోట్ల బడ్జెట్ ఉన్న చిత్రాలకు దర్శకత్వం వహించే అవకాశాలు వచ్చాయన్నారు. ఇప్పటి వరకు ప్రియతమా నువ్వచట కుశలమా, నువ్విలా నేనిలా, సినిమా చూపిస్త మావా, నేను లోకల్, హలో గురూ ప్రేమ కోసమే, ధమకా సినిమాలకు రచయితగా, దర్శకునిగా పని చేశానన్నారు. ప్రస్తుతం తాను తీయబోయే దిల్ రాజు ప్రొడక్షన్, మైత్రీ మూవీస్, కేఎల్ విశ్వవిద్యాలయం యాజమాన్యం నిర్మించే చిత్రాలకు సంబంధించి కథా చర్చలు జరుగుతున్నాయన్నారు. ఉత్తరాంధ్ర వెనుకబడి ఉందని అందరూ అంటుంటారని అది సరికాదన్నారు. ఈ ప్రాంతంలో రాజకీయ, పారిశ్రామిక, సినిమా, క్రీడలు, రియల్ ఎస్టేట్ రంగాలకు చెందిన దిగ్గజాలు ఉన్నారన్నారు. వారిని ఒక వేదికపైకి తీసుకువచ్చి ఈ ప్రాంతం వెనుకబడిన ప్రాంతం కాదని ప్రపంచానికి చాటిచెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పుప్పాల వంశీ, గాడు శ్రీను, కొప్పల రమేష్, గాడు వెంకటనారాయణ, కాళ్ల నగేష్, గుడ్డాల ఎల్లయ్య, కొప్పల కృష్ణ, గిడుతూరి పూర్ణ, మాదాబత్తుల శేఖర్, సురాల వెంకటరావు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యమం ఉధృతం

కూర్మన్నపాలెం: ఉక్కు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని ప్రముఖ సినీనటుడు ఆర్.నారాయణమూర్తి పిలుపునిచ్చారు. ఉక్కు పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం ఆర్చ్ వద్ద నిర్వహిస్తున్న రిలే దీక్షలకు ఆయన మద్దతు తెలిపారు. శుక్రవారం నాటికి దీక్షలు 1072వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్‌లోని ఎం.ఎం.ఎస్.ఎం, ఎస్.టీ.ఎం విభాగ కార్మికులు, ఉక్కు నిర్వాసితులుతో పాటు ఆర్.నారాయణమూర్తి పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నారాయణమూర్తి మాట్లాడుతూ దేశ ప్రజల ఆస్తిని కార్పొరేట్ కంపెనీలకు అమ్మడం అంటే తల్లి పాలు తాగి రొమ్ము గుద్దడమే అవుతుందని విమర్శించారు. ఉక్కు ఉత్పత్తికి కేంద్ర ప్రభుత్వం ఎన్ని అవరోధాలు సృష్టించిన కార్మికుల శక్తితో సంస్థ మళ్లీ నిలదొక్కుకుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన ఆలోచనను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో తమ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

తీర్థ యాత్రలకు వెళ్లి తిరిగిరాని లోకాలకు..

- అనకాపల్లి సమీపంలో శంకరం వద్ద రోడ్డు ప్రమాదం
- ఒకే కుటుంబంలో ముగ్గురు దుర్మరణం
- మృతులు కాకినాడ జిల్లావాసులు
- మరో ఐదుగురికి స్వల్ప గాయాలు

ఏటా మాదిరిగానే తీర్థ యాత్రలకు వెళ్లి ఉత్సాహంగా తిరిగి వస్తున్న ఆ కుటుంబాన్ని పెను విషాదం కమ్మేసింది. రోడ్డు ప్రమాదం వారి ఆనందాన్ని ఆవిరి చేసింది. కారు టైరు పేలిన దుర్ఘటనలో కుటుంబంలోని ముగ్గురు ప్రాణాలు కోల్పోవడంతో బంధువులు, సహ కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.


ఘటనా స్థలం నుంచి దేవీ కుసుమను ఆస్పత్రికి తరలిస్తున్న కుటుంబ సభ్యులు


భార్య సత్యవతి మృతదేహం వద్ద రోదిస్తున్న భర్త సత్యనారాయణ


సంఘటన స్థలం నుంచి కారును తొలగిస్తున్న క్రేన్

అనకాపల్లి/బిక్కవోలు (కాకినాడ జిల్లా): అరసవిల్లి, శ్రీకూర్మం, సింహాచలంలో దైవదర్శనాలు చేసుకున్నారు.. అందరూ ఆనందంగా తిరుగుపయనమయ్యారు.. ఇంతలో పెద్ద శబ్దం.. అది వచ్చింది తమ కారు నుంచేనని తెలుసుకునేలోపే ఘోరో ప్రమాదం .. కారు టైరు పంక్చర్ కావడంతో పల్టీలు కొట్టి, అందులో ప్రయాణిస్తున్న కాకినాడ జిల్లా బిక్కవోలు గ్రామానికి చెందిన పోలిరెడ్డి సత్యవతి (49), పోలిరెడ్డి సూర్యకుమారి (38), పోలిరెడ్డి అభిరామ్ (4) అక్కడికక్కడే చెందారు. అనకాపల్లి సమీపంలోని శంకరం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం ఈ దుర్ఘటన జరిగింది. బిక్కవోలుకు చెందిన పోలిరెడ్డి సత్యనారాయణ, అతని సోదరుడు కుటుంబ సభ్యులతో ప్రతి ఏటా తీర్థయాత్రలకు వెళుతుంటారు. అలాగే ఈసారి కూడా శ్రీకాకుళం జిల్లాలోని శ్రీకూర్మం, అరసవిల్లి, విశాఖ జిల్లాలోని సింహాచలం దేవాలయాలను దర్శించుకునేందుకు 11 మంది రెండు కార్లలో వెళ్లారు. దర్శనం అనంతరం తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. పోలిరెడ్డి సత్యనారాయణ, అతని భార్య సత్యవతి, సత్యనారాయణ తమ్ముడి భార్య సూర్యకుమారి, సత్యనారాయణ కుమారుడు పోతురాజు(రాజా), మనవడు అభిరామ్, ఇంకా వెంకటరమణ, అశోక్, దేవీకుసుమలు ఒక కారులో వస్తున్నారు. మిగిలిన కుటుంబ సభ్యులు రెండో కారులో వస్తున్నారు. అనకాపల్లి కలెక్టర్ కార్యాలయం సమీపంలో కారు టైరు పేలిపోవడంతో పక్కనే ఉన్న డివైడర్‌ను గుద్ది, పల్టీలు కొట్టడంతో కారు వెనుక సీటులో ఉన్న ముగ్గురు మృతి చెందారు. ముందు సీటులో కూర్చున్న వారికి స్వల్పగాయాలయ్యాయి. క్షణాల్లో రహదారి అంతా రక్తసిక్తంగా మారింది. కారు పల్టీకొట్టి రోడ్డుకు అడ్డంగా పడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఒకపక్క మృతదేహాలు.. మరోపక్క గాయపడ్డవారి రోదనలు.. అటుగా రాకపోకలు సాగించే వారిని కంటతడి పెట్టించాయి. సమాచారం తెలుసుకున్న డీఎస్పీ వి.సుబ్బరాజు, సీఐలు జి.శంకరరావు, టి.శ్రీను ఘటనాస్థలికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగి క్రేన్ సహాయంతో ప్రమాదానికి గురైన కారును తొలగించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. క్షతగాత్రులకు ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రాథమిక చికిత్స చేసి, పంపించివేశారు.

నిబంధనల మేరకు ఎన్నికలకు ఏర్పాట్లు

- జేసీ కె.ఎస్.విశ్వనాథన్ వెల్లడి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్‌తో వీడియో కాన్ఫరెన్స్

మహారాణిపేట: నియమ, నిబంధనలకు అనుగుణంగా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు జిల్లాలో ఏర్పాట్లు చేస్తామని జేసీ కె.ఎస్.విశ్వనాథన్ తెలిపారు. ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం 2024, పెండింగ్ దరఖాస్తులు, పోలింగ్ కేంద్రాలలో వసతులు, శాశ్వత ఉద్యోగుల సమాచార సేకరణ, ఉద్యోగుల బదిలీలు, తదితర సమాచారంపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం జిల్లా కలెక్టర్లతో విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో ఎటువంటి పెండింగ్ ఫారాలు లేకుండా తగిన చర్యలు చేపడతామని చెప్పారు. ఎన్నికలకు సరిపడా స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను ఇప్పటికే గుర్తించామన్నారు. డీడబ్ల్యూడీ ఓటర్లకు సంబంధించిన వివరాలను ఈఆర్‌వోలతో మరోసారి పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైన ఎన్నికల పరిశీలకులు, పోలింగ్ అధికారులు, ఇతర సిబ్బంది విషయమై చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రతి జిల్లా, మండల కేంద్రాలలో ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించాలని ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా సూచించారు. ఏఆర్వోలకు విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి కేంద్రాలుగా ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లపై కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్‌రెడ్డి, ఈఆర్‌వోలు, సహాయ డీఐవో పాషా, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్, ఎన్నికల డీటీలు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధినిస్తున్న 'మాడగడ'

ప్రముఖ పర్యాటక కేంద్రమైన మాడగడ సన్‌రైజ్ వ్యూపాయింట్ పర్యాటకులను అమితంగా ఆకట్టుకుంటోంది. ప్రతిరోజూ ఈ ప్రాంతానికి దేశ విదేశాల నుంచి పర్యాటకులు వస్తున్నారు. ఉదయం ఐదు గంటల నుంచి పది గంటల వరకు ఆడిపాడి సందడి చేయడంతో ఈ ప్రాంతం జాతరను తలపిస్తోంది. డప్పు వాయిద్యాలు, సంప్రదాయ నృత్యాలతో గిరి మహిళలు నృత్యం చేస్తుంటే పర్యాటకులు కూడా గిరిజన వేషధారణలో వారితో కలిసి డ్యాన్స్ చేస్తున్నారు. గిరిజన వస్త్రధారణలో సిద్ధం చేసినందుకు ఒకొక్కరి నుంచి రూ.200 తీసుకుంటూ స్థానిక మహిళలు ఉపాధి పొందుతున్నారు. తినుబండారాల అమ్మకాలు భారీగా జరుగుతున్నాయి. సన్‌రైజ్ వ్యూపాయింట్‌కు తరలించడం ద్వారా ఆటో యజమానులు ఉపాధి పొందుతున్నారు. ఇక్కడ సుమారు 300 కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి.

– అరకులోయ టౌన్


డప్పు వాయిద్యాలతో గిరిజన కళాకారుల సందడి


గిరిజన కళాకారులతో కలిసి పర్యాటకుల థింసా నృత్యం


మాడగడ సన్‌రైజ్ వ్యూపాయింట్‌కు తరలివచ్చిన సందర్శకులు